క్లుప్తంగా

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం



పామర్రు: ప్రభుత్వాలు విద్యార్థుల సంరక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని గుడివాడ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్ పేర్కొన్నారు. స్థానిక టీకేఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి నుంచి దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా ఒత్తిడికి గురి చేస్తే కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థి దశలో ఏదైనా సమస్య వస్తే వాటి పరిష్కారానికి పలు చట్టాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పామర్రు సీఐ శుభాకర్, ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, డెప్యూటీ తహసీల్దార్ గోపాల రావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మహాయోగిని బ్రహ్మోత్సవాలు

పమిడిముక్కల: పెనుమత్స శ్రీ మహాయోగిని ఆలయంలో మహాయోగిని 66వ బ్రహ్మోత్సవాలు ఆరు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో గురువారం సాయిబాబాకు పూలతో సహస్ర నామ పూజ చేశారు. భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. ఉయ్యూరు, మొవ్వ, ఘంటసాల భజన సమాజాలు చేసిన భజనలు ఆకట్టుకొన్నాయి. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

బాధిత కుటుంబానికి చేయూత

భట్లపెనుమర్రు(మొవ్వ): మొవ్వ మండలం భట్లపెనుమర్రు దళితవాడలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన చిలి రమేష్, భార్య చిలి రాణి కుటుంబానికి గురువారం మొవ్వ మండల రెడ్ క్రాస్ సొసైటీ, కృష్ణా జిల్లా హ్యుమానిటీ ఫస్ట్ ఇండియా(అహమ్మదీయ ముస్లిం కమ్యూనిటీ)వేర్వేరుగా నిత్యావసరాలను అందజేశారు. తహసీల్దార్ కె.మస్తాన్, కూచిపూడి ఎస్సై కె.నాగ విశ్వనాథ్ పాల్గొని పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ వంట సామగ్రి, టార్పాలిన్, కాస్మెటిక్స్, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. హ్యుమానిటీ ఫస్ట్ ఇండియా సభ్యులు మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మొవ్వ మండల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోనేరు మంజునాథ్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు స్ఫూర్తిదాయకం

కూచిపూడి(మొవ్వ): బాటసారుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రాలు పలువురికి స్ఫూర్తిదాయకమని కూచిపూడి ఎస్సై కె.నాగవిశ్వనాథ్ పేర్కొన్నారు. కూచిపూడిలో శ్రీ సిద్దేంద్ర యోగి ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని గురువారం ఎస్ఐ ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులకు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త పిన్నమనేని గోపాల కృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మీర్జా అమానత్ అలీ, కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభం

తోట్లవల్లూరు: అపరాల కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని బొద్దపాడు సర్పంచి మూడే శివశంకర్ సూచించారు. మండలంలోని బొద్దపాడు రైతు సేవా కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. రైతులకు కనీస మద్దతు ధర అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు శివశంకర్ తెలిపారు. క్వింటాలు మినుము రూ. 7,400, పెసలు 8,682కు కొనుగోలు చేస్తారని చెప్పారు. డీసీఎంఎస్ సెంటర్ ఇన్‌చార్జి నాగార్జున, ఉప సర్పంచ్ కె.శివశంకర్, వార్డు సభ్యులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, పాలకేంద్రం అధ్యక్షుడు వసంత్‌కుమార్, వ్యవసాయ సహాయకుడు యశ్వంత్‌కుమార్, డీసీఎంఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి

కైకలూరు: ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్యను డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్ అఖిల భారత బోర్డు సభ్యులుగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా కైకలూరు రామకృష్ణ సేవాసమితిలో ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక, సామాజిక సమరసత వేదిక, సమరసతా సేవా ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులు ఆయన్ను గురువారం ఘనంగా సన్మానించారు. మండలంలోని రామవరానికి చెందిన సుబ్బయ్య మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిదన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తనను బోర్డు సభ్యులుగా నియమించిన కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వశాఖ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొటుకుల జాషువ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలి.. గోతులు పడి..



గోతుల్లో నెమ్మదిగా..



ఎగుడు.. దిగుడు జాగ్రత్తగా వెళ్లాల్సిందే..



అదుపు తప్పితే కాల్వలోకే

మామిడికోళ్ల, కొతవరం ఒకటో వార్డు ప్రధాన రహదారి రాళ్లు తేలి గోతులు పడి ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఈ రహదారిపై రాకపోకలంటే వాహనచోదకులకు నరకం కనపడుతోంది. ఈ దారిలో లంకాదొడ్డి, మామిడికోళ్ల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తూ.. అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డులో రాత్రి వేళల్లో వెళ్లాలంటే వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతం. ఈ రహదారి గోతుల్లో నుంచి అదుపు తప్పితే పక్కనే ఉన్న పుల్లేటి కాల్వలో పడిపోయే ప్రమాదం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

–గుడ్లవల్లేరు



కోతకు గురైన రోడ్డు

ఉపాధి హామీ పనుల పరిశీలన

పామర్రు: మండల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులతో నిరుద్యోగులకు ఎంతో లబ్ధి చేకూరుతోందని ఏపీఎం సురేష్ తెలిపారు. మండలంలో జరుగుతున్న పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో ఎంతో మంది తమ ఉద్యోగాలను కోల్పోయి గ్రామాల్లో ఉంటున్నారన్నారు. వారికి గ్రామాల్లోనే 'ఉపాధి' దొరుకుతోందన్నారు. 25 గ్రామ పంచాయతీల్లో మొత్తం 1,560 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారన్నారు. పలు గ్రామాల్లో త్వరలో చెరువు అభివృద్ధి పనులు, గట్లు పటిష్ట పరిచే పనులు నిర్వహిస్తారన్నారు. అన్ని గ్రామాల పరిధిలో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా జరుగుతున్నాయని చెప్పారు. కచ్చితమైన కొలతలతో, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్‌లు, మేట్లు పాల్గొన్నారు.



పామర్రులో పంటబోదె తవ్వకం పనులు

పీఎంఏవై గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

గుడ్లవల్లేరు: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద గృహ నిర్మాణాలను చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని గుడ్లవల్లేరు మండల హౌసింగ్ ఏఈ ఆలపాటి సురేంద్ర తెలిపారు. గురువారం ఆయన తన సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి గుడ్లవల్లేరులో పీఎంఏవై కింద దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మన ఇల్లు మన గౌరవం పథకంలో భాగంగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందజేసే రూ.1.80లక్షలతో పాటు పీఎంఏవై 2.0లో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల్లోని ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50వేలను అదనంగా ఆర్థిక సాయం చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నిర్ణయం తీసుకుందన్నారు. ఇంకా పూర్తి కానటువంటి పీఎంఏవై 1.0లో కూడా లబ్ధిదారులు ఎవరైనా నిర్మాణం వెంటనే చేసుకుంటే ఇవి వర్తిస్తాయని చెప్పారు. పీఎంఏవై 1.0లో భాగంగా గుడ్లవల్లేరు మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ అందరూ అడిషనల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్(ఏఎఫ్ఏ) సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ సర్వే ఈ నెల 23వ తేదీ లోపుగా పూర్తి చేసి...నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నామని చెప్పారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

గుడివాడ టౌన్: సహకార సంఘాలు బలోపేతమైతే లబ్ధిదారులకు, ఖాతాదారులకు మేలు జరుగుతుందని సహకార సంఘాల జిల్లా అధికారి కె. చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ది గుడివాడ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో అంతర్జాతీయ సహకార దినోత్సవం పురస్కరించుకుని సహకార సంఘాల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధి, బలోపేతం తదితర వాటిపై అధికారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘాల ఆడిట్ అధికారి పీఆర్‌పీ రెడ్డి, గుడివాడ సహకార సంఘం అధికారి వి. వి. ఫణి కుమార్, బ్యాంక్ అధికారి సీహెచ్. రవికుమార్, బ్యాంక్ సీఈఓ టీఎస్ఎస్ఆర్ చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ



సాక్షి స్పందన

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో రేషన్ బియ్యం అందని కార్డుదారులకు జిల్లా స్థాయి అధికారుల అదేశాలతో గురువారం సాయంత్రం పంపిణీ చేశారు. 'అధికారుల నిర్లక్ష్యం.. అందని రేషన్ బియ్యం' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జిల్లా స్థాయి అధికారులు పేదలకు బియ్యం వెంటనే అందేలా ఏర్పాటు చేశారు. తహసీల్దార్ వై.రంగారావు, సివిల్ సప్లయి డీటీ కిరణ్ ఆధ్వర్యాన రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేశారు.

ఖరీఫ్ ప్రణాళికలకు సిద్ధం కావాలి

మండవల్లి: వచ్చే సీజన్‌లో ఖరీఫ్ ప్రణాళికలకు అందరూ కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఏడీఏ జి.వెంకటమణి పేర్కొన్నారు. మండవల్లి వెలుగు కార్యాలయంలో వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా సంఘాల ప్రతినిధులకు కన్వర్జన్స్ సమావేశం గురువారం నిర్వహించారు. అంతా కలిసి పని చేసి రైతులకు, మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించిన పంట నుంచి వచ్చే ఆహారం ఆరోగ్యకరమైందని, ఈ విధానాలను రైతులకు మరింత చేరువ చేయడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. ఎంఏఓలు జరీనా, వేణుమాధవ్, ఏపీఎంలు రాజేశ్వరి, శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మధుబాబు, అగస్టిన్, గౌతమ్‌కుమార్, నాగవిజయ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు

ముదినేపల్లి రూరల్: మండలంలో ప్రధానమైన ముదినేపల్లి–కోరుకొల్లు ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేపట్టారు. వీటికి రూ.4 కోట్ల నిధులు మంజూరు కావడంతో పూర్తిగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పనులు ప్రారంభించారు. సుమారు 25 కిలోమీటర్ల రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉదయశంకర్

కైకలూరు: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గురజాడ ఉదయశంకర్ నియమితులయ్యారు. గురువారం కోర్టు ఆవరణలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా రాగాని సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శిగా కుమ్మరికుంట కోటయ్య, సహాయ కార్యదర్శిగా బోడావుల ఇందిర, కోశాధికారిగా గునుకుల జితేంద్ర బాబు, గ్రంథాలయ కార్యదర్శిగా రజీమున్ని, క్రీడా కార్యదర్శిగా అడ్డగర్ల శాంతి స్వరూప్, సాంస్కృతిక కార్యదర్శిగా సరిపల్లి రత్నరాజు, మహిళా ప్రతినిధిగా కనుమూరి రమాదేవి ఎన్నికయ్యారు. ఈ నెల 27న పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

విద్యుత్ సరఫరా వేళల మార్పు

పమిడిముక్కల: గుడివాడలోని 220కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పామర్రు, పమిడిముక్కల, మొవ్వ మండలాల పరిధిలోని వ్యవసాయ మోటార్లకు శనివారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటలకు బదులు తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు మచిలీపట్నం ఏఈ జి.గోవిందరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మార్పు జరిగిందని పేర్కొన్నారు.

కైకలూరు: నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 21 నుంచి 31 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి

గుడివాడరూరల్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. స్థానిక వన్‌టౌన్ పీఎస్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 22 నుంచి జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లపై యువత తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌తో లక్షలాది రూపాయలు పోగొట్టుకుని అప్పులు పాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నివారించడానికి పోలీసు శాఖ ఇప్పటికే అవగాహన కల్పిస్తోందన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లు, జూదాలు ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

విఘ్నేశ్వరుడి ఆలయానికి వితరణ

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో నిర్మించిన మండపం అభివృద్ధి పనులకు భక్తులు విరాళాలు ఇచ్చినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడెడ్ల రామారావు, లక్ష్మీరంగ దంపతులు రూ. 51 వేలు, బరిగెల రాధాకృష్ణ, సుజాత దంపతులు రూ. 25 వేలు, అడబాల దుర్గాప్రసాద్, నాగశ్రీ దంపతులు రూ. 10,116 , గంటా చంద్రశేఖర్–ఉష దంపతులు రూ. 10,116, పంచకర్ల వెంకట్, సుమతి దంపతులు రూ. 5,116 స్వామివారికి వితరణ ఇచ్చినట్లు వివరించారు. దేవస్థానం వేద పండితులు వేద మంత్రాలతో దాతలకు ఆశీర్వచనాలు అందజేశారన్నారు.

రేపు మండలపరిషత్ సమావేశం

ముదినేపల్లి రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 22 మధ్యాహ్నం నిర్వహిస్తామని ఎంపీడీవో వై.రామకృష్ణ గురువారం తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశంలో మండలంలోని సర్పంచ్‌లు ఎంపీటీసీల సభ్యులు మండల స్థాయి అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

తోట్లవల్లూరు: శ్రీవిజయదత్త సాయినాథుడి ఆలయ 14వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. బాబాకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన, సాయంత్రం బాబా పల్లకీసేవ జరిగాయి.

పామర్రు: సాయినగర్‌లోని సాయి మందిరంలో బాబాకు విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో షిర్డీ సాయి భక్త సమాజ సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, మల్లికార్జునరావు, రాధాకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ టయోటా షోరూం ప్రారంభం



గుడివాడ టౌన్: ఆటోమొబైల్ బ్రాండ్ టయోటా నూతన షోరూంను పట్టణంలో గురువారం ప్రారంభించారు. ఆర్టీఓ ఎస్‌యూఎస్ఎస్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టయోటా తన ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తోందన్నారు. కొత్త కొత్త సౌకర్యాలు టయోటాలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో టయోటా సీఈఓ రామకృష్ణ, సేల్స్ మేనేజర్ రాఘవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కైకలూరు–వాడపల్లి బస్సు సౌకర్యం

కైకలూరు: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం నుంచి ఉదయం ఐదు గంటలకు కైకలూరు ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి బస్సు సౌకర్యం కల్పించారని ఏలూరు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కీర్తి వెంకట రామప్రసాద్ గురువారం చెప్పారు. నేరుగా కైకలూరు నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ఏలూరు ఆర్టీసీ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వరప్రసాద్‌ను కోరామన్నారు. ఆయన బస్సు సౌకర్యం కల్పించారని చెప్పారు.

లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లి రూరల్: వివక్షకు దారి తీసే గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని వాటిని అరికట్టాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలుపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు వివక్షకు దారి చూపితే అనేక ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. సమావేశంలో తహసీల్దార్ జీఎస్ సుభాని, ఎంపీడీవో వై.రామకృష్ణ, ముదినేపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు శాంతిశ్రీ మాట్లాడారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, పోలీసు సిబ్బంది మండల పరిషత్ సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి

వేసవిలో ప్రబలే వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ అన్నారు. మండలంలోని దేవపూడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పని చేయాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఆస్పత్రిని సందర్శించి వైద్య సిబ్బంది సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో సమస్యలపై సిబ్బందితో చర్చించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మధుసూధనరావు, మండల పరిషత్ ఏవో రమణబాబు, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి కాలనీ వాసులకు మంచినీళ్లివ్వండి

- సీపీఎం మండల కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి
- మల్లాయపాలెం–2 సచివాలయం వద్ద ఆందోళన



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆర్సీపీ రెడ్డి, కాలనీ వాసులు

గుడివాడరూరల్: మల్లాయపాలెం పంచాయతీ పరిధిలో 20 ఏళ్ల క్రితం ఏర్పాటైన శ్రీకాళహస్తి కాలనీ ప్రజలకు సరైన మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం సిగ్గుచేటని సీపీఎం మండల కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి విమర్శించారు. మల్లాయపాలెం సచివాలయం–2 వద్ద ఆ కాలనీ వాసులు సీపీఎం ఆధ్వర్యాన తాగునీటి కోసం గురువారం నిరసన తెలిపారు. ఆర్సీపీ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు ఎప్పటికప్పుడు ట్యాంకర్లతో అరకొరగా తాగునీరిచ్చి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. పైపులైన్లు వేసిన తర్వాత కూడా నీటి సరఫరా జరగకపోవడంతో వేసవిలో తాగునీటికి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో కాలనీ వాసులతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు లంకా సురేంద్ర, ఆర్.కొండ, కాలనీ వాసులు ఎం.మంగమ్మ, బి.లక్ష్మి, ఎం.లోకేశ్వరి, భవానీ, రంగారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మండలాభివృద్ధే ధ్యేయంగా పాలన

ఎంపీపీ కాసాని వేదసుప్రజ

పమిడిముక్కల: మండలాభివృద్ధే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న తనపై ఇద్దరు ముగ్గురు ఎంపీటీసీలు తమ స్వార్థం కోసం అసత్య ప్రచారం చేస్తున్నారని ఎంపీపీ కాసాని వేద సుప్రజ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల పరిషత్ సమావేశంలో తీసుకొన్న నిర్ణయం మేరకే నిధుల కేటాయింపు జరుగుతుందని, సభ్యులందరికీ ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. తనను గౌరవించినట్లే ఎంపీటీలను కూడా గౌరవించాలని ప్రతి సమావేశంలో అధికారులకు చెబుతూనే ఉన్నానన్నారు. మండల పరిషత్ ఉద్యోగులు తమ ఇంటికి ఎంబుక్‌లు తీసుకురావడం, తాను కొంతమందికి సంతకాలు పెట్టకపోవడం జరగలేదన్నారు. అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తున్నానని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధి పాటుపడాలని కోరారు. ఎంపీటీసీలకు ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, మధ్యవర్తుల వద్దకు వెళ్లవద్దని, మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు.

సుబ్బారాయుడికి రూ.14.35 లక్షల ఆదాయం



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో పలు ఆలయాల మేనేజర్లు, సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి రూ.14,34,506, 16 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి కానుకల రూపేణా వచ్చినట్లు సహాయ కమిషనర్ తెలిపారు. ఈ ఆదాయం 90 రోజుల పాటు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా వచ్చిందని సహాయ కమిషనర్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, బొంగు రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

పెదపారుపూడి: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ప్రత్యేకావసరాల విద్యార్థులకు మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ఫిజియోథెరపిస్టు కె. శ్యామ్ ప్రసాద్ ఆరుగురు చిన్నారులకు థెరపీ చేశారు. వారం వారం క్రమం తప్పకుండా థెరపీ చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐఆర్పీలు హరిబాబు, కిషోర్‌బాలు పాల్గొన్నారు.

అన్న సమారాధన

మండవల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని శ్రీదత్త పరంపర షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం అన్నసమారాధన జరిగింది. యూఎస్ఏకు చెందిన హనుమకొండ అభినయ్, హైందవి దంపతుల ఆర్థిక సౌజన్యంతో జరిగింది. తొలుత బాబాకు విశేష పూజలు చేశారు. నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా కోడిపందేలు

మోపర్రు(పెదపారుపూడి): మోపర్రులో వారం రోజుల నుంచి యథేచ్ఛగా కోడి పందేలు జరుగుతున్నాయి. గ్రామంలోని రైస్ మిల్లు సమీపంలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మండలంలోని పలు గ్రామాలు, జనార్దనపురం నుంచి అధిక సంఖ్యలో బైక్‌లపై వచ్చి మరి పందెలు వేస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో పోలీసులు దాడులు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.